

కలెక్టరేట్ లోపలకు వెళ్లకుండా అంగన్వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు



1. ఆందోళనకారుల్ని లాక్కెళుతున్న పోలీసులు
2. కలెక్టరేట్‌లోకి దూసుకెళుతున్న అంగన్వాడీ వర్కర్లు
3. ఆందోళనలో సొమ్మసిల్లిన అంగన్వాడీ కార్యకర్త

అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడితో రణరంగం

- ప్రధాన గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు
- అయినా, లోపలకు దూసుకెళ్లిన కార్యకర్తలు
- తోపులాటలో పలువురికి స్వల్పగాయాలు

చిత్తూరు, జనవరి 3: అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం రణరంగంగా మారింది. అడ్డుకున్న పోలీసులను వీరు తోసుకుంటూ లోపలకు వెళ్లారు. పోలీసులు, అంగన్వాడీల మధ్య తోపులాటలో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. ఓ మహిళ స్పృహతప్పారు. తమకు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ అంగన్వాడీలు సమ్మెను ఉధృతం చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో బుధవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో మంగళవారం నుంచే యూనియన్ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అంగన్వాడీలపై నిఘా ఉంచారు. అయినా పోలీసుల కళ్లుగప్పి వందలాది మంది అంగన్వాడీలు ఆటోలు, ఇతర మార్గాల ద్వారా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. బారికేడ్లు పెట్టి.. రోప్ పార్టీలతోనూ పోలీసులు అడ్డుకున్నారు. ప్రధాన గేటును తోసుకుంటూ లోపలకు దూసుకెళ్తుండగా.. అదే సమయంలో పోలీసులు అడ్డగించారు. పోలీసులు, అంగన్వాడీల తోపులాటలో కిందపడి చాలామందికి స్వల్పగాయాలయ్యాయి. ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం రణరంగంగా మారింది. కొంతమంది అంగన్వాడీలను, యూనియన్ నాయకులు, సీఐటీయూ నేతలను పోలీసులు ఈడ్చుకెళ్లి వ్యానులో ఎక్కించారు. వీరిని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా అంగన్వాడీలు అడ్డుకున్నారు. వీరిని పక్కకు తోసే క్రమంలోనూ ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు పోలీసులు అడ్డుకుంటున్నా.. కొందరు అంగన్వాడీ కార్యకర్తలు ప్రధాన గేటును తోసుకుని కలెక్టరేట్ లోపలకు వెళ్లిపోయారు. చివరకు డీఆర్వో రాజశేఖర్ బయటకు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. వారి సమస్యలను విన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారు. రెండో పట్టణ పోలీసు స్టేషనుకు తీసుకెళ్లిన ఆందోళనకారులను సాయంత్రం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.



కలెక్టరేట్ ముందు రహదారిపై అంగన్వాడీల ఆందోళన

జగన్.. ఇచ్చిన మాట నిలబెట్టుకో

అంతకుముందు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వస్తే తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఇచ్చిన మాటను జగన్ నిలబెట్టుకోవాలని డిమాండు చేశారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీని చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా చర్చలలో మళ్లీ కోర్టుకు వెళ్లమని చెప్పడం దుర్మార్గమన్నారు. ముగ్గురు మంత్రులు సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి వివిధ రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని, వారి ఆటలుసాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విజ్ఞతతో ఆలోచించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతి, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లానాయకులు గిరిధర్ గుప్తా, ఓబులు రాజు, భువనేశ్వరి, ఈశ్వరయ్య, ప్రభావతి, షకీలా, మమత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

● నిరసనాగ్రహం

ఒకవైపు అంగన్వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. మరోవైపు యూటీఎఫ్ ఆధ్వర్యాన టీచర్లూ ధర్నాకు దిగారు. తమ డిమాండ్ల మాటేంటంటూ సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తున్నారు. తమను రెగ్యులర్ చేయాలంటూ కార్పొరేషన్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లోని కార్మికులు సమ్మె బాట పట్టారు. ఇలా బుధవారం చిత్తూరులో వీరంతా ప్రభుత్వంపై నిరసనాగ్రహం ప్రకటించారు.



వివేకానంద విగ్రహం ముందు ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, టీచర్లు

● మా డబ్బులు ఇవ్వకుంటే

రిటర్న్ గిఫ్టు ఇస్తాం

ప్రభుత్వానికి యూటీఎఫ్ నేతల హెచ్చరిక

చిత్తూరు (సెంట్రల్), జనవరి 3: 'వివిధ అవసరాల నిమిత్తం మేము దాచుకున్న డబ్బులు ఇవ్వమంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదు. మా డబ్బులు మాకు ఇవ్వడానికి ఇబ్బంది పెడితే రానున్న ఎన్నికల్లో రిటర్న్‌గిఫ్టు ఇస్తాం' అని ప్రభుత్వానికి యూటీఎఫ్ నేతలు హెచ్చరించారు. ఆర్థిక బకాయిలు విడుదల చేయాలంటూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘం జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు బుధవారం చిత్తూరులో 12 గంటల ధర్నా చేపట్టారు. కట్టమంచిలోని వివేకానంద విగ్రహం ముందు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్ మాట్లాడుతూ.. తనకు తానే మేధావిగా ప్రకటించుకున్న జయప్రకాష్ నారాయణ పాత పింఛను ఇస్తే రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో పడుతుందని చెబుతున్నారన్నారు. పదేళ్లుగా రూ.15 లక్షల కోట్లు కార్పొరేట్ పన్ను రాయితీ ఇవ్వటం ద్వారా ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం కాదా అని ప్రశ్నించారు. తమకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుంటే సమ్మె తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో యూటీఎఫ్ నాయకులు దక్షిణామూర్తి, బాషా, మునిరత్నం, రెహెనాబేగం, ప్రసన్న, రఘుపతి, దీనావతి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు వినబడలేదా జగనన్నా..!



ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 3: 'నేను ఉన్నాను. నేను విన్నాను' అని చెబుతున్న జగన్.. 15 రోజులుగా మేము చేస్తున్న సమ్మె కనిపించలేదా? మా సమస్యలు వినబడలేదా' అని ముఖ్యమంత్రిని సమగ్రశిక్షలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రశ్నించారు. రెగ్యులర్ చేయడంతో పాటు ఎంటీఎస్ అమలు చేయాలన్న డిమాండుతో వీరు బుధవారం చిత్తూరులోని డీఈవో కార్యాలయంలో నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టంచేశారు. ఎస్ఎస్ఏ జేఏసీ నాయకులు శ్రీనివాసులు, విల్వనాథం, ప్రకాష్, దేవరాజ్, యుగంధర్, గీత, చందు, తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేసేవరకు సమ్మె విరమించం

● నగర పాలక కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

చిత్తూరు, జనవరి 3: మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు వేతనాలను పెంచి, పర్మినెంట్ చేసేవరకు సమ్మెను విరమించేది లేదని ఏఐటీయూసీ గౌరవ సలహాదారు మణి, నగర కార్యదర్శి దాసరిచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి హెచ్చరించారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా బుధవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో వీరు మాట్లాడారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకపోగా నిర్వీర్యం చేయానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రజలు రోగాల బారినపడకుండా చూడాలన్నారు. ఈ ధర్నాలో కార్మిక సంఘం నాయకులు వాసు, జయశంకర్, సురేష్, వినాయక, సుగుణ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

● కాగా, కార్మికుల సమ్మెతో పారిశుధ్య పనులకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. చెత్త తరలించే వాహనాలకు డ్రైవర్ల కొరత ఏర్పడటంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాహనాలను నడిపారు. పర్మినెంట్ ఉద్యోగులతో పారిశుధ్య పనులు చేయించారు. కమిషనర్ అరుణ, ఇతర అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించి ఈ పనులను పరిశీలించారు.



నగర పాలకసంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఆస్తికోసం దాడి చేస్తున్నారు

● నడిరోడ్డుపై న్యాయంకోసం ఓ మహిళ నిరసన



నడిరోడ్డుపై బైఠాయించిన చంద్రమ్మ - గ్రామపెద్దల దౌర్జన్యం గురించి వివరిస్తున్న చంద్రమ్మ

కుప్పం, జనవరి 3: ఆస్తికోసం గ్రామపెద్దలు కొందరు, తన సోదరుడితో కలిసి తనమీద దాడికి పాల్పడుతున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పం పట్టణంలో నడిరోడ్డుపై బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళ కథనం మేరకు.. కుప్పం మండలం పైపాళ్యంలో నివసిస్తున్న చంద్రమ్మకు భర్త, రెండవ కొడుకు చనిపోయారు. పెద్ద కొడుకు ఉపాధికోసం వలస వెళ్లాడు. దీంతో ఒంటరిదైన చంద్రమ్మ నుంచి ఆమె ఆస్తిపాస్తులు లాక్కోవడానికి సోదరుడు మునినిరత్నంతోపాటు కొందరు గ్రామపెద్దలు కలిసి దాడిచేసి బాధిస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆమె బుధవారం నేతాజీరోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. తనకు న్యాయం జరిగేదాకా లేచేదిలేదని భీష్మించింది. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి, ఆమెను బలవంతంగా లేపి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని చెప్పడంతో ఆమె కూడా వారితో కలిసి స్టేషన్‌కు వెళ్లారు.

రూ.80.90 కోట్ల పెన్షన్ పంపిణీ



లబ్ధిదారులకు మెగాచెక్‌ను అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 3: జిల్లాలో 2,76,008 మంది పించన్‌దారులకు జనవరి నెల నుంచి రూ.3వేల చొప్పున పింఛన్ పంపిణీ చేపట్టినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అనంతరం రూ.80.90 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఈనెల నుంచి పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని రూ.3వేల చొప్పున లబ్ధిదారులకు వలంటీర్లు అందజేస్తారని చెప్పారు. జనవరి నెల నుంచి కొత్తగా 3937 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. డీఆర్డీఏ పీడీ తులసి, చిత్తూరు మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

22న ఓటర్ల జాబితా ప్రచురణ : డీఆర్వో



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 3: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 22న ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఎన్.రాజశేఖర్ అన్నారు. బుధవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. డిసెంబరు 9వ తేదీవరకు అందిన క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు మార్పులు-చేర్పులు, తొలగింపులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ శాతం పెంచేందుకు ఈనెల 25న పలుచోట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కిల్ కాలేజీలో హెల్త్ కేర్ వర్కర్లకు శిక్షణ

చిత్తూరు (సెంట్రల్), జనవరి 3: 'హెల్త్ కేర్ వర్కర్లు, నర్సుల కోసం స్కిల్ కాలేజీలో శిక్షణ ఇస్తారు. అనంతరం అంతర్జాతీయ నియామకాలు చేపడతారు' అని డీఆర్‌డీఏ పీడీ తులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ (సీడాప్)లో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న గ్రామీణ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. విజయవాడలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజీలో 19-35 ఏళ్లలోపు అర్హులైన వారికి నాలుగు నెలల శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు ఈశ్వర్‌ను 93905 04650, సుదర్శన్‌రాజును 93905 04626 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలివ్వండి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 3: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను పంపాలని ఈఆర్వో, ఏఈఆర్వోలను జేసీ శ్రీనివాసులు కోరారు. బుధవారం సాయంత్రం అన్నిశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి సూచించిన పనుల్లో నిర్లక్ష్యం లేకుండా సకాలంలో నివేదికలు అందించాలన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ వేగవంతం చేయాలని, తప్పనిసరిగా వలంటీర్ల ద్వారా యాప్‌లో అప్‌డేట్ చేయడంతోపాటు ఫొటోలు పంపాలన్నారు. డీఆర్వో రాజశేఖర్, ఐసీడీఎస్, పౌరసరఫరాలశాఖ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలు, మున్సిపల్ కమిషనర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో అవకతవకలు

విచారణ జరిపించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పనుల వివరాలను తెలియజేయాలని హెచ్ఎంని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాలసముద్రం, జనవరి 3: పాలసముద్రం మండలంలోని ఎస్ఆర్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు - నేడు పను ల్లో అవకతవకలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు మణికంఠన్, ఎత్తిరాజులు నాయుడు, వినోద్, సుధాకర్, దేవరాజులు పాఠశాలకు వెళ్లారు. అక్కడ పనులను పరిశీలించారు. ఎంత ఖర్చుపెట్టారో లెక్కలు తెలియజేయాలని హెచ్ఎం మనోహర్ నాయుడిని కోరారు. అలాగే ఈ విషయమై విచారించాలని వారు డీఈవోను కోరారు. ఇదిలా ఉంటే.. హెచ్ఎం తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఉపాధ్యాయులు రెండ్రోజుల కిందట డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, డీఈవో విజయేంద్రరావుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాలపై హెచ్ఎం మాట్లాడుతూ.. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడం లేదని, అడిగాననే తనపై ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారని హెచ్ఎం చెబుతున్నారు. రెండ్రోజుల్లో నాడు-నేడు పనుల లెక్కలు పాఠశాల కమిటీ ఎదుట ఉంచుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



పుత్తూరు అర్బన్, జనవరి 3: పుత్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతిచెందారు. ఎస్ఐ వెంకట మోహన్ కథనం మేరకు.. పుత్తూరు పట్టణం ఉత్తరపు కండ్రిగ దళితవాడకు చెందిన సుధాకర్ కుమారుడు దినకర్ (17) ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం కళ్యాణపురం వైపు నడిచి వెళుతుండగా ఆరేటమ్మ ఆలయం క్రాస్ వద్ద వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే అతడు మృతి చెందాడు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌తో టచ్‌లో 33మంది ఎమ్మెల్యేలు: చింతా

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 3: రాష్ట్రంలో 33మంది వైసీపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ చెప్పారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. షర్మిల ధైర్యశాలి అని ఆమె పార్టీలోకి వచ్చాక పదవి గురించి ఆలోచిస్తామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఏపీకి ఇన్‌ఛార్జిగా వేయాలని అధిష్ఠానానికి సూచిస్తానన్నారు. బయటకు చెప్పుకోలేని కొన్ని విషయాలను ఆటోబయోగ్రఫీలో రాస్తున్నానని, ఇందులో విస్మయం చెందే విషయాలు వెల్లడిస్తానన్నారు.

అందరి చూపూ జనసేన స్థానాల వైపే!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అటు రాజకీయ వర్గాలతో పాటు ఇటు ప్రజానీకం కూడా వచ్చే ఎన్నికల్లో జనసేన పోటీ చేయనున్న స్థానాల పై ఆసక్తి కనబరుస్తున్నాయి. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జనసేన ఎన్ని స్థానాలు కోరుతుంది, ఏయే స్థానాలు కోరుతుంది అన్న దానిపై అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రత్యేకించి బలిజ సామాజికవర్గం అధికంగా వున్న తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ స్థానాలతో పాటు రాజంపేట పార్లమెంటు స్థానంలో ఈ రెండు పార్టీల నిర్ణయం ఎలా వుంటుందన్న విషయమై ఇతరులతో పాటు టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల్లో కూడా ఆసక్తి నెలకొంటోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై తీవ్ర స్థాయిలో కసరత్తు సాగిస్తున్న నేపథ్యంలో అన్ని వర్గాల్లో దీనిపై విస్తృత చర్చ నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి సీటు ఎవరికి?

వైసీపీ అధిష్ఠానం అసెంబ్లీ, ఎంపీ స్థానాలపై శరవేగంగా నిర్ణయాలు తీసుకుని ప్రకటించేస్తున్న సంగతి తెలిసిందే. దానికి సమాంతరంగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా కొద్ది రోజులనుంచీ దీనిపై సమాలోచనలు సాగిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీల నడుమ పొత్తు వున్న కారణంగా రెండు పార్టీల అధినేతల నడుమా స్థానాల సర్దుబాట్ల గురించి స్పష్టత రావాల్సి వుంది. అధినేతలు దానిపై కసరత్తు జరుపుతున్నట్టు సమాచారం. కొద్ది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. అయితే ఆ లోపు దీనిపై జిల్లావ్యాప్తంగా చర్చ ఎక్కువైంది. ముఖ్యంగా జనసేనకు కేటాయించే స్థానాలపై జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధుల్లో బలిజ సామాజికవర్గం బలంగా వున్న సంగతి తెలిసిందే. 2009 ఎన్నికల్లో చిరంజీవి ప్రజారాజ్యం తరపున తిరుపతి నుంచీ పోటీ చేసి గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి పొత్తులో భాగంగా తిరుపతిని జనసేనకు కేటాయిస్తారన్న అంచనాలు పెరిగాయి.అలాగే పవన్ కళ్యాణ్ పోటీ చేయాలన్న డిమాండ్ కూడా జనసేన శ్రేణుల నుంచీ బలంగా వుంది. 3అయితే పవన్ కళ్యాణ్ పోటీ చేసే అవకాశాలు లేవు గానీ సీటు కోసం మాత్రం ఆ పార్టీ గట్టిగా పట్టుబడుతోందని సమాచారం.సీటు కేటాయించడానికి చంద్రబాబు సుముఖంగానే వున్నారని, కాకపోతే ఆ పార్టీ నుంచీ బలమైన అభ్యర్థి లేకపోవడాన్ని గుర్తు చేస్తున్నారని తెలిసింది. జనసేనకు కేటాయించాలంటే బలమైన అభ్యర్థిని అన్వేషించాలని, లేదంటే టీడీపీ నుంచే అభ్యర్థిని పోటీకి నిలపడం మంచిదని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలిసింది. తిరుపతిలో టీడీపీకి ఎంత బలమున్నప్పటికీ, బలిజ సామాజికవర్గ ప్రాబల్యం వున్నప్పటికీ పోటీ చేసే అభ్యర్థి కూడా బలంగానే వుండాలని, అభ్యర్థిని ఆషామాషీగా తీసుకునే ప్రసక్తే లేదని చంద్రబాబు భావిస్తున్నట్టు సమాచారం. దీంతో తిరుపతి సీటు ఏ పార్టీ అభ్యర్థికి దక్కుతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది.

చిత్తూరుపైనా విస్తృత చర్చ

చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా బలిజ సామాజికవర్గం రాజకీయంగా ప్రాబల్యం కలిగివుంది. ఇక్కడ కూడా టీడీపీ ఆ వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. దీంతో ఈ సీటు కూడా పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఇక్కడ కూడా జనసేనకు బలమైన అభ్యర్థి దొరకడం కష్టంగా వుంది. కాకపోతే డీకే ఆదికేశవులు కుటుంబం నుంచీ ఎవరైనా జనసేనలో చేరి పోటీకి సిద్ధపడితే ఇబ్బంది వుండకపోవచ్చు. డీకే కుటుంబీకులు ముందుకు రాకుంటే జనసేనకు ఇక్కడ సీటు కేటాయించే అవకాశాలు తక్కువ.అయితే చిత్తూరులో ఎన్నికల రాజకీయాలు ఆఖరు నిమిషంలో అనూహ్యంగా మారడం పరిపాటి కావడంతో అక్కడ రానున్న రోజుల్లో ఏమి జరుగుతుందన్నది అంచనా వేయలేని పరిస్థితి నెలకొనివుంది.

మదనపల్లెలో అవకాశాలు అధికం

మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో బలిజలు గణనీయ సంఖ్యలో వున్నారు. రాయలసీమ మొత్తం మీద జనసేనకు బలమైన నాయకత్వం వున్న నియోజకవర్గాల్లో ఇది మొదటిది. సొంత బలం కలిగిన గంగారపు రామ్‌దాస్ చౌదరి ఈసారి టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచీ చురుగ్గా పనిచేస్తున్నారు. బలిజ సామాజికవర్గంతో సన్నిహితంగా మెలగడంతో పాటు సొంత కమ్మ సామాజికవర్గంలోనూ పట్టు కలిగివున్నారు. ఇక్కడ రెండు పార్టీలూ కలసి పనిచేస్తే గెలుపు సునాయాసం కానుంది. అనుకూలతలు అధికంగా వున్నందున ఉమ్మడి జిల్లాలో మదనపల్లె సీటు పొత్తులో జనసేనకే కేటాయిస్తారన్న అంచనాలు, ప్రచారం గత చాలాకాలం నుంచీ వున్నాయి. ఇక్కడ పొత్తు మీద జనసేనకు సీటు ఇస్తారా? ఇస్తే ఉమ్మడి అభ్యర్థిగా ఎవరికి అవకాశం వుంటుంది? ఏ సామాజికవర్గం నుంచీ అభ్యర్థి వుంటారు? అన్న అంశాలపై ఇపుడు తీవ్ర చర్చ నడుస్తోంది.

రాజంపేట పార్లమెంటు సీటుపైనా పెరిగిన ఆసక్తి

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పుంగనూరు, మదనపల్లె, పీలేరు, రాయచోటి, కోడూరు, రాజంపేట, తంబళ్లపల్లి తదితర మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బలిజ సామాజికవర్గ ఓటర్లు గణనీయంగా వున్నారు. ప్రత్యేకించి పుంగనూరు, మదనపల్లె, పీలేరు, రాయచోటి, కోడూరు, రాజంపేటల్లో అత్యధికంగా వున్నారు. ప్రజారాజ్యం పార్టీ తరపున 2009లో కూడా ఇక్కడ డీకే ఆదికేశవులు కుమారుడు శ్రీనివాస్ పోటీ చేశారు. 2019లో టీడీపీ తరపున డీకే ఆదికేశవులు సతీమణి సత్యప్రభ పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజంపేట ఎంపీ సీటును జనసేన గట్టిగా కోరే అవకాశముంది. తిరుపతి, చిత్తూరు అసెంబ్లీ సీట్ల తరహాలోనే ఇక్కడ కూడా జనసేనకు బలమైన అభ్యర్థులు ప్రస్తుతానికి అందుబాటులో లేరనే చెప్పాలి. డీకే ఆదికేశవులు కుటుంబం నుంచీ ఎవరైనా ముందుకొస్తే వైసీపీకి దీటైన పోటీ ఇవ్వడానికి ఆస్కారం వుంటుంది.బలిజ సామాజికవర్గంలో అత్యధికులు ఎలాగూ జనసేనకు మద్దతిస్తారు కాబట్టి రెడ్డి సామాజికవర్గం నుంచీ అభ్యర్థిని బరిలోకి దింపితే పోటీ హోరాహోరీగా వుంటుందని, గెలుపొందే అవకాశాలు కూడా వుంటాయని టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఎన్నికలకు కేవలం రెండు నెలలు మాత్రమే వ్యవధి వున్నందున టీడీపీ, జనసేన పొత్తుకు సంబంధించి ఈ నాలుగు స్థానాలపై రాజకీయ వర్గాల్లోనూ, సామాన్య ప్రజానీకంలోనూ ఆసక్తి పెరుగుతోంది.

ఇళ్లు పగుళ్లుబారుతున్నాయ్.. న్యాయం చేయండి!

జల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన ● దారికి అడ్డంగా కందకం తవ్విన తిమ్మాపురంవాసులు





దారికి అడ్డంగా తవ్విన కందకం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కుప్పం, జనవరి 3: కుప్పం మండలం మిట్టపల్లె పంచాయతీ, తిమ్మాపురం సమీపంలోని జల్లి క్వారీవల్ల ఇబ్బంది పడుతున్న గ్రామీణులు బుధవారం రోడ్డెక్కారు. క్వారీ వాహనాలు తిరిగే దారికి అడ్డంగా కందకం తవ్వి ఆందోళనకు దిగారు. బాధిత గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తిమ్మాపురం సమీపంలో స్థానిక వ్యక్తికి ఉన్న జల్లి క్వారీని తమిళనాడువారికి లీజుకు ఇచ్చారు. ఈ క్వారీతో తమకు నష్టం జరుగుతోందని, ఆస్తిపాస్తులు ధ్వంసమవుతాయని సబ్ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు గ్రామస్తులు చాలాసార్లు ఫిర్యాదు చేశారు. ప్రజల ఆస్తిపాస్తులకు ఏదైనా నష్టం జరిగితే నష్టపరిహారం ఇస్తామని ఫ్యాక్టరీ యజమానులు అప్పట్లో హామీ ఇచ్చారు. అప్పట్నుంచి నడుస్తున్న జల్లి క్వారీతో తిమ్మాపురం గ్రామస్తులకు కష్టనష్టాలు ప్రారంభమయ్యాయి. ఎగిరి పడే కంకర రాళ్లతో ఇళ్ల గోడలు పగుళ్లుబారుతున్నాయి. గాలి కాలుష్యంతో తరచూ చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారు. పశువుల కోసం తెచ్చిన బూసా (పశువుల మేత) దుమ్ము పడి పనికిరాకుండా పోతోంది. దీనిపై క్వారీ యజమానులను పలుమార్లు నిలదీసినా సరైన సమాధానం రాలేదు. చివరకు క్వారీలోని రాళ్లవల్ల ఇంటి గోడలు ధ్వంసమైన రామలింగం, సోముతోపాటు మరికొందరు గ్రామస్తులు, కొంత మంది ప్రజాప్రతినిధులను తీసుకుని బుధవారం ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. తమ ఇళ్లు దెబ్బతిన్నాయని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దీంతో తమకు సంబంధం లేదని, ఫ్యాక్టరీ నడుపుకొనేందుకు లైసెన్సు ఉందంటూ వారు సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఫ్యాక్టరీ వాహనాలు రాకపోకలు సాగించే దారి మధ్యలో ఎక్స్‌కవేటర్‌తో పెద్ద కందకం తవ్వి, అక్కడే ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పక్కకు పంపేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కొద్దిపాటి ఉద్రిక్తత తలెత్తింది. ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



బాలికలు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కల్లూరు, జనవరి 3: బాలికలు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈఓలు సిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవరి 24న నిర్వహించనున్న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురష్కరించుకుని బుధవారం బాలికలకు మండల స్థాయి వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. బాలికల హక్కులు, సంరక్షణ, వాటి అమలుపై పోటీల్లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వ్యాసరచనలో కల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని భాను మొదటి స్థానంలో నిలిచింది. పెయింటింగ్ పోటీల్లో మంగళంపేట విద్యార్థిని భావన, వక్తృత్వపు పోటీల్లో ఎల్లంకివారిపల్లి విద్యార్థిని సంజన మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం



తిమ్మరాజుపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

శాంతిపురం, జనవరి 3 : పల్లెలు ప్రగతి పథంలో పరుగులు పెట్టాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యపడుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేసుబాబు అన్నారు. మంగళవారం రాత్రి తిమ్మరాజుపల్లెలో మండల టీడీపీ నేతలతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు తేడా వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మళ్లీ కుప్పం నియోజకవర్గం శాంతియుతంగా ఉండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్ నాయుడు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, కడపల్లె యూనిట్ ఇన్‌చార్జి పెద్దన్న, టీడీపీ నేతలు రమేష్, వెంకటేష్ దొరస్వామి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి భూములిచ్చిన పేదలను ఆదుకోవాలి

శాంతిపురం, జనవరి 3: విమానాశ్రయానికి భూములు ఇచ్చిన శాంతిపురం మండలం అమ్మవారిపేట, రామాపురం గ్రామాలకు చెందిన దళిత పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామాల దళితులు ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్పకు వినతిపత్రం అందించారు. బుధవారం మండల సచివాలయంలో వారిని గ్రామస్తులు కలిసి సమస్యను విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్సీ, ఎంపీ మాట్లాడుతూ మంత్రి, ముఖ్యమంత్రి వద్ద చర్చించి తగు న్యాయం చేస్తామని గ్రామస్తులకు వారు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే హామీతో ముగిసిన దీక్ష



దళిత నేతలతో మాట్లాడుతున్న వెంకటేగౌడ

వి.కోట, జనవరి 3: అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులు పునఃప్రారంభిస్తామని ఎమ్మెల్యే వెంకటేగౌడ హామీ ఇవ్వడంతో రెండు రోజులుగా కొనసాగుతున్న దీక్షను సాధన సమితి నేతలు ముగించారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో కొనసాగుతున్న దీక్షా శిబిరం వద్దకు ఎమ్మెల్యే చేరుకుని దళిత నేతలతో మాట్లాడారు. అంబేడ్కర్ భవన్ గత ఆరేళ్ళుగా అర్ధాంతరంగా ఆగిందని, పనులపై కనీసం దృష్టి సారించలేదని, దీంతో నిర్మాణ స్థలం ఆక్రమణలకు గురవుతోందని, దానిని పరిరక్షించాలని ఆయనకు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ఆక్రమణల తొలగింపుకు చర్యలు చేపట్టి భవన నిర్మాణ పనులు త్వరలో చేపడుతామని తెలపడంతో దళిత నేతలు దీక్ష విరమించారు. రిలే నిరాహార దీక్షకు కాంగ్రెస్ నాయకులు ఇనాయతుల్లా, అన్నదాన సేవా సంఘం వేణు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బాస్ నేతలు గణపతి, విశ్వనాథ్, వినోద్, సురేంద్ర, సుబ్రమణ్యం, సంపంగి, శంకరప్ప, శంకర్రావు, గుర్రప్ప, చంద్రశేఖర్, గోపి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ రాకపోతే విద్యార్థులే ఉపాధ్యాయులు



ఉపాధ్యాయురాలి అవతారమెత్తిన విద్యార్థిని

రామకుప్పం, జనవరి 3: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గడ్డూరులోని ప్రాథమిక పాఠశాలలో సింగిల్ టీచర్ ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 40మందికి పైగా విద్యార్థులున్న ఈ పాఠశాలలో గత సెప్టెంబరు నెల వరకు ఇద్దరు ఉపాధ్యాయులుండేవారు. సెప్టెంబరులో ఒకరు పదవీవిరమణ పొందారు. దీంతో అప్పటి నుంచి ఒక్క టీచరే అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఆ టీచర్ సెలవుపై వెళ్ళినా, సమావేశాలకు వెళ్ళినా విద్యార్థులే టీచర్ల అవతారమెత్తుతున్నారు. దీని వల్ల చిన్నారుల విద్యాభ్యాసంపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సత్వరం రెండో టీచర్ పోస్టును భర్తీ చేయాలని, లేకుంటే ప్రస్తుతం ఉన్న టీచర్ విధులకు హాజరు కానీ పరిస్థితి ఏర్పడినప్పుడు వేరేవరినైనా డెప్యుటేషన్ ద్వారా విధులకు హాజరయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి

రామకుప్పం, జనవరి 2: టీడీపీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు రెడ్డిపురుషోత్తం, పార్టీ చెల్దిగానిపల్లె పంచాయతీ అధ్యక్షుడు మంజేనాథ్ తెలిపారు. బుధవారం వారు చెల్దిగానిపల్లెలో ఇంటింటా టీడీపీ గ్యారెంటీ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులపాలయ్యారన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంతోంగా ఉండాలంటే అది టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నేతలు వెంకటాచలం, చంద్రకుమార్, రమేష్, అమరేష్ పాల్గొన్నారు.

ఏటవాకిలిలో పైపులైన్‌కు మరమ్మతులు



పుంగనూరు రూరల్, జనవరి 3: పుంగనూరు మండలం ఏటవాకిలి దళితవాడలో పైపులైన్ లీకేజీలకు బుధవారం అధికారులు మరమ్మత్తు పనులు చేయించారు. పైప్‌లైన్ లీకేజీ.. తాగునీరు కలుషితం అనే వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో ఏటవాకిలి పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది బుజంగం స్పందించి వెంటనే రిపేర్లు చేయించారు. లీకేజీ ప్రాంతాల్లో తవ్వి పైపులు రిపేర్లు చేసి సమస్య పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



రాధమ్మ కాలుకు కట్టు కడుతున్న 108 సిబ్బంది

పుంగనూరు రూరల్, జనవరి3: పుంగనూరు-మదనపల్లె మార్గంలోని కొత్తయిండ్లులో రోడ్డుపై నడిచివెళుతున్న మహిళను ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. కొత్తయిండ్లుకు చెందిన బాలాజీ భార్య రాధమ్మ బుధవారం ఉదయం కూలీ పనుల నిమిత్తం నడిచి వెళుతుంటే వెనుకవైపు నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో కాలుకు దెబ్బ తగిలింది. తీవ్రంగా గాయపడిన రాధమ్మకు రోడ్డుపైనే 108 సిబ్బంది కట్టుకట్టి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచనల మేరకు కుటుంబ సభ్యులు ఆమెను తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి

రామకుప్పం : రామకుప్పం పంచాయతీ పరిధి మిట్టపల్లెలోని పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం జడ్పీటీసీ నితిన్‌రెడ్డి తహసీల్దారు మురళీకి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే ఇళ్ళ స్థలాల కోసం భూమిని గుర్తించి అర్హులందరికీ స్థలాలు కేటాయిస్తామని తహసీల్దారు తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి3 : నాలుగున్నర ఏళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రరాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతి పాలైందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన పలమనేరు మండలం సముద్రపల్లి పంచాయితీలో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందిన వారికంటే ఇబ్బందులు పడుతున్న వారే ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. నేడు అంగన్వాడీల మొదలు అందరూ రోడ్లపైకి వచ్చే దుస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజురెడ్డి, ప్రధానకార్యదర్శి గణేష్, సీనియర్ నాయకులు బాలాజీనాయుడు, జగదీష్‌నాయుడు, మల్లీశ్వరరెడ్డి, రామచంద్రనాయుడు, పెద్దబ్బ, విజయ్, చలపతి, రాజేష్, తదితరులతో పాటు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు, జనసైనికులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన టీడీపీ నాయకులను బుధవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి పరామర్శించారు. పలమనేరు మండలం టి.ఒడ్డూరులో టీడీపీ నాయకులు కట్టిన జెండాలను వైసీపీ కార్యకర్తలు తొలగిస్తుండగా టీడీపీ నాయకుడు స్వతంత్ర్యబాబు తదితరులు అడ్డుకొన్నారు. దీంతో ఒక్కసారిగా రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు స్వతంత్యబాబుతోపాటు మరికొందరిపై గణేష్, రమేష్, సుబ్రమణ్యం, పద్మ, వెంకటేష్, కార్తీక్, కృష్ణమూర్తి, అన్నపూర్ణ, కుమర్‌స్వామి, నడివీధిరమేష్, అమర్నాథ్, బాలయ్య తదితరులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని బాధితులు వాపోయారు. తీవ్రంగా గాయపడిన స్వతంత్రబాబు, దొరస్వామి, అమరేంద్ర, వినోద్‌లను గ్రామస్తులు వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి బుధవారం పలమనేరు ఆసుపత్రికి చేరుకొని గాయపడిన క్షతగాత్రులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ కల్పించాలన్నారు.



గాయపడిన టీడీపీ నాయకులను పరామర్శిస్తున్న అమరనాథ రెడ్డి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి





పుంగనూరులో విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం, గంగవరం లయన్స్‌క్లబ్‌లో మహిళా టీచర్లకు సన్మానం

పుంగనూరు రూరల్, జనవరి 3: అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రీబాయి పూలే అని, ఆమె మొదటి మహిళా ఉపాధ్యాయురాలై, బాలికల విద్య కోసం తొలి పాఠశాలను ప్రారంభించారని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుంగనూరు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎస్టీయూ ఉపాధ్యాయులు సావిత్రీబాయి పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి చదువుల తల్లిగా పేరు తెచ్చుకున్న ఘనత సావిత్రిబాయికే దక్కిందన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం ఎంఈవో రెడ్డెన్నశెట్టి, ఎస్టీయూ నాయకులు మోహన్, దీపారాణి, సుమల, రాధామణి, రేవతి, పద్మజ, సురేఖ, మాధవి, భాగ్యమ్మ, గంగులమ్మ, నాగలక్ష్మి, రమ్యకృష్ణ, శ్రీరేఖ, భారతి, గంగాభవాని, నగీనా, అస్మాబేగం, పార్వతమ్మ, హేమలత, శ్రీధర్, బుడ్డన్న, మంజునాథ్, సుధాకర్, వెంకటేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్షర పాఠశాల ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, సురేశ్, మహిపాల్‌రెడ్డి, మణికంఠ, సురేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమల : నంజంపేట హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కుసుమాంబ, జగన్‌మోహన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, వసంతకుమారి, శ్రీదేవి, స్వాతి, గాయత్రి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు : సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు ముందుకు సాగినప్పుడే సామాజిక అభివృద్ధి జరుగుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు పేర్కొన్నారు. బుధవారం కళామందిరంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పుష్ప, శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చైతన్యకళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఓబీసీ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు.కళాశాల కరస్పాండెంట్ ప్రమోద్, బీసీ ఉద్యోగ సంఘ నాయకులు వెంకటకృష్ణయ్య, రాజశేఖర్, మునిరాజులు, పవన్‌కుమార్, బాలకృష్ణ, కుమరస్వామి, రవి, శ్రీనివాసులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. పలమనేరు బీజేపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పట్టణ బీజేపీ కన్వీనర్ తాతయ్యనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

చౌడేపల్లె : మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని స్థానిక హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు హెచ్ఎం నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామకుప్పం : సావిత్రిబాయి పూలే జయంతిని రామకుప్పంలో టీడీపీ యువనేతలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూజలు చేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు సతీష్, ఆదిల్, అమర్, అవినాశ్, హుసేన్, ప్రవీణ్, చాన్‌బాషా, పవన్, లోకేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపిన మహా చైతన్యమూర్తి సావిత్రిబాయి పూలే అని ఎంబీసీ(మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్) రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక లయన్స్‌క్లబ్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శారద మాట్లాడుతూ సావిత్రీబాయి ఆశయాలకు అనుగుణంగా రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలురంగాల్లో విశిష్ట సేవలందించి రాణిస్తున్న ప్రసన్నలక్ష్మి, కళావతి, రమ, లాలామాధవి, సంగీత, రమారాణి, కవిత, వరలక్ష్మి, అన్నపూర్ణ, సువిత్ర, విజయ, యమున, శిరీష, సుజాతలను సన్మానించారు. కార్యక్రమంలో వీరభద్రగౌడు, పాపయ్య, మునెప్పమొదలియార్, గిరిధరమూర్తి, గురుమూర్తి, కుమార్, భాస్కర్, లక్ష్మీనారాయణ, శంకర్, హరి, షణ్ముగం, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రఘు పాల్గొన్నారు.







పలమనేరు చైతన్య కళాశాల, చౌడేపల్లె హైస్కూల్‌లలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులు, నంజంపేట హైస్కూల్‌లో టీచర్లకు సన్మానం

భద్రతలేని భూ హక్కు చట్టం 27ను రద్దు చేయాలి



భూ వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలంటూ ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

పుంగనూరు, జనవరి 3: ప్రజల భూములకు భద్రతలేని ప్రజా వ్యతిరేకమైన కొత్త చట్టం 27ను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. బుధవారం పుంగనూరులో న్యాయవాదులు కోర్టు ఆవరణ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేసి మానవహారంగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేకంగా అమలు చేసిన యాక్ట్ 27ను రద్దు చేయకపోతే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడక తప్పదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివశంకర్‌నాయుడు, ఆనంద్ కుమార్, షరత్‌కుమార్, తోట గిరిధర్, చంద్రశేఖర్, గాయిత్రి, మల్లిఖార్జుననాయుడు, వై.వెంకటరమణ, నూరి, ప్రసాద్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, అరవింద్‌కుమార్, ప్రసాద్, వెంకట్రామయ్యశెట్టి, జహంర్‌బాషా, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందూరులో కంటి వైద్యశిబిరం



సోమల, జనవరి 3: మదనపల్లె లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కందూరులో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బాలాజీ క్లినిక్‌లో కంటి వైద్య నిపుణులు నివేదిక, గౌతంరెడ్డి 70మందికి పరీక్షలు జరిపి 20మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు అమరశ్రీ మెడికల్స్ మోహన్ రెడ్డెప్ప, గల్లా మధుసూదన్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యశాల చైర్మన్ బోడిపాటి భాస్కర్ నాయుడు, భాస్కరాచారి పాల్గొన్నారు. .

సారా ఊట ధ్వంసం



సోమల, జనవరి 3: గట్టువారి పల్లె సమీపంలో 800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. 15 లీటర్లను సారాను స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్, నంజం పేట, ఆవులపల్లె తదితర ప్రాం తాల్లో తనిఖీలు చేపట్టారు. సారా అమ్మకాలు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం



కుప్పం రూరల్, జనవరి 3: అడవిబూదుగూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయిని నాగమ్మను సత్కరించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ దివ్యభారతి, ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, ఉపాధ్యాయుడు విజయేంద్ర, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



చౌడేపల్లె, జనవరి3: పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పశువైద్యాధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పొదలపల్లెలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవటం, పని సామర్థ్యం తగ్గటం, పాల ఉత్పత్తి తగ్గటం, పాలు తాగే దూడలు మృతి చెందటం తదితర సమస్యలు వస్తాయని, ప్రతి రైతు వారి పశువులకు వ్యాధి సోకకుండా టీకాలు వేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రెడ్డిప్రసాద్, బాలాజీ, పాడి రైతులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



హౌసింగ్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఈ

సోమల, జనవరి 3: గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ రమేశ్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం సోమలలోని హౌసింగ్ కార్యాలయంలో రికార్డును పరిశీలించారు. అనంతరం సోమల-కందూరు రోడ్డు మార్గంలోని కాలనీని, టీటీడీ కల్యాణ మండపం వద్ద గృహనిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో సమీక్షించారు. బిల్లు మంజూరు, సిమెంట్ పంపిణీలను ఆరా తీశారు. కాలనీల్లో విద్యుత్, నీటి సౌకర్యాలు పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది గణేశ్, జావిద్ అలీవలి పాల్గొన్నారు.

పులిచెర్లకు 93 కొత్త పింఛన్లు

కల్లూరు, జనవరి 3: పులిచెర్ల మండలానికి నూతనంగా 93 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో రాజశేఖరబాబు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఏవో సుగుణమ్మ పాల్గొన్నారు.

చౌడేపల్లె మండలంలో 88..

చౌడేపల్లె :మండలంలో కొత్తగా 88 మందికి పింఛన్లు మంజూరైనట్లు ఎంపీపీ రామ్మూర్తి పేర్కొన్నారు ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దామోదర్‌రాజు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరం



కుప్పం రూరల్, జనవరి 3: మండలంలోని వేపూరు గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ మధు, యూన్సీ, రాణి, పార్థసారధి సేవలు అందించారు.

చంద్రబాబును కలిసిన సర్పంచులు



శాంతిపురం, జనవరి 3 : టీడీపీ అధినేత చంద్రబాబును శాంతిపురం మండలం గుంజార్లపల్లె సర్పంచ్ విజయ రామిరెడ్డి, నడింపల్లె సర్పంచ్ బాలకృష్ణ, సోన్నేగానిపల్లె సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, సి.బండపల్లె ఎంపీటీసీ నామాలప్పలు విజయవాడలో కలిశారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధుల ఇవ్వడం లేదని, దీంతో గ్రామాల్లో తిరగాలంటే భయం వేస్తుందని చంద్రబాబు చెప్పామన్నారు.

జగనన్నతోనే పేదలకు సంక్షేమ ఫలాలు

శాంతిపురం, జనవరి 3 : మండల సచివాలయం ఆవరణలో బుధవారం ఎమ్మెల్సీ భరత్ పెంచిన పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ జయరాం, ఎంపీపీ వసుంధర, వైస్ ఎంపీపీలు పట్టాభి, సరస్వతి, అధికారులు ఎంపీడీవో హేమమాలిని పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పలమనేరు, జనవరి3 : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ పెరిగిన పింఛన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, వైసీపీ నాయకులు సుభాష్‌చంద్రబోస్, చెంగారెడ్డి, బాలజినాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వి.కోట : వి.కోట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెంకటేగౌడ పెంచిన రూ. 3 వేలు పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బాలగురునాథ్ ఉన్నారు.

రాయల కాంస్య విగ్రహావిష్కరణ పోస్టర్ల విడుదల



పలమనేరు, జనవరి3 : పుంగనూరులో ఈనెల 10వ తేదీ కృష్ణదేవరాయల కాంస్య విగ్రహం ఏర్పాటు పోస్టర్లను బుధవారం పలమనేరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పూలత్యాగరాజు, నానబాల గణేష్, మణి, దైవప్రసాద్, కోటీశ్వర్లు, అమ్ములు, వాసు, నరసింహులు, వెంకటేసు, మోహనరంగయ్య, మునిరాజులు, సుబ్రమణ్యం, శంకరయ్య, భాస్కర్, జనార్ధన్, నరేష్, పూలచైతన్య, హరీష్, కిషోర్, శబరి, పుంగనూరు బలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కుప్పం, జనవరి3: పేదాగొప్పా తారతమ్యం లేకుండా అందరికీ ఆరోగ్యం అందించడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. కుప్పం కొత్తపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ఆయన వైస్ చైర్మన్ మునస్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదివరకే వలంటీర్ల దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి, నూతనంగా చేసుకున్నవారికి కూడా ఇంటింటికీ వెళ్లి అన్నిరకాలైన వైద్య చికిత్సలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే పేదల సంక్షేమం

పలమనేరు, జనవరి3 : వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాతనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. బుధవారం పలమనేరు మండలం కొలమాసనపల్లి సచివాలయం వద్ద వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలు అమలు గురించి విశదీకరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సుభాషచంద్రబోస్, చెంగారెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి, బాలాజి నాయుడు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షితల పంపిణీ



కల్లూరు, జనవరి 3: పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పంచాయతీల వారీగా అయోధ్య రాముడి అక్షితలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ఈనెల 24న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకలను పురష్కరించుకుని రాముడి అక్షితలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, నాయకులు నాధమునిరెడ్డి, నాగరాజప్రసాద్, దామోదర్, గంగయ్య, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్

చిత్తూరు, జనవరి 3: నగరపాలక పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో కమిషనర్ నిర్దేశించిన కనీస సౌకర్యాలు ఉండాలని కమిషనర్ అరుణ చెప్పారు. బుధవారం కమిషనర్ ఎం.బండపల్లె ప్రాథమిక పాఠశాలలోని 51వ పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, బీఎల్వోలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం



గుడిపాల, జనవరి 3: గుడిపాలలో బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో 169వ రోజు నిర్వహించిన అన్న క్యాంటీన్‌కు బెంగళూరుకు చెందిన చంద్రా నాయుడు భోజనం వితరణ చేశారు. నాయకులు రవి నాయుడు, కిట్టు, కుప్పుస్వామి, సుధాకర్ యాదవ్, బాల, రాజ తదితరులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం: నలుగురి అరెస్టు



కార్వేటినగరం, జనవరి 3: తెల్లగుంట్లపల్లె దళితవాడ పరిసర ప్రాంతాల్లో కార్వేటినగరం ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీలో 900 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎస్ఐ భాస్కర్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు చెప్పారు.

కాంగ్రెస్‌కి పూర్వవైభవం తీసుకొద్దాం: చింతామోహన్



కార్వేటినగరం, జనవరి 3: కాంగ్రెస్‌కి పూర్వవైభవం తీసుకొద్దామని ప్రజలకు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం టీకేఎం పేటలో ఆయన పర్యటించారు. పార్టీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షుడు జనకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్



సరళామేరి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు, జనవరి 3: చిత్తూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సరళామేరి, పలువురు కార్యకర్తలు బుధవారం వైసీపీలో చేరారు. జానకారపల్లెలో జరిగిన ఈ కార్యక్రమంలో సరళామేరి, పన్నీర్ సెల్వం దంపతులతోపాటు పలువురు డివిజన్ స్థాయి నాయకులకు వైసీపీ కండువాలను విజయానందరెడ్డి కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు సహదేవన్, శ్రీకాంత్, మాజీకార్పొరేటర్లు కేపీ శ్రీధర్, కృష్ణమూర్తి, వైసీపీ నేతలు శంకరయ్యగుంట అన్బు, దొడ్డిపల్లె శివ, త్యాగరాజులు, రాజన్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి

గుడిపాల: కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ రాధమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని విజయానందరెడ్డి సందర్శించి, నివాళులర్పించారు. నాయకులు మధుసూదన్ రాయల్, చిట్టిబాబు, నవీన్ కుమార్, గోళ్ల హరిప్రసాద్ చౌదరి, గడ్డం విజయ్, రాసనపల్లి ప్రకాష్, సెల్వం, అన్బు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 3: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన షణ్ముఖ రూ.1,51,116, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50,001 వితరణ చేశారు. ఈ మొత్తాన్ని బుధవారం చెక్కు రూపంలో అందించారు. దాతను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి: డీఈవో

పూతలపట్టు, జనవరి 3: ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో చదువుకోవాలని డీఈవో విజయేంద్రరావు సూచించారు. బుధవారం పూతలపట్టు ఉన్నతపాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు కొంతసేపు పాఠాలు చెప్పారు. అనంతరం మధ్యాహ్నభోజనం తయారీని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూతలపట్టులో అన్నదానం



పూతలపట్టు, జనవరి 3: మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జన్మదిన వేడుకలు టీఎన్‌టీయూసీ రాష్ట్రనేత యువరాజు నాయుడు ఆదేశాలతో పూతలపట్టులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, నారా లోకేశ్, చింతమనేని ప్రభాకర్ ఉన్న భారీ కేక్‌ను కట్‌చేసి, పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, డీసీసీబీ మాజీ డైరక్టర్ కాంతారావు, నాయకులు ఊట్ల నాగరాజు నాయుడు, హేమాద్రి నాయుడు, గణపతి నాయుడు, చిరంజీవి, హరీష్, హిమకర్, దగ్గుపాటి మోహన్, ప్రమోద్, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



వినాయకపురం పాఠశాలలో సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థినులు

కార్వేటినగరం, జనవరి 3: సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సీ.ఎస్.లత తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి, అధ్యాపకులు సరిత, లావణ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం కేశవులు ఆధ్వర్యంలో మహిళా టీచర్లను సన్మానించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

నగరి: వినాయకపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు ప్రసన్నరాజకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జడ్పీ ఉన్నత పాఠశాలలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆమూరు సుధాకర్, జిల్లా అధ్యక్షుడు వీఎన్ శివకుమార్ ఆధ్వర్యంలో మహిళా టీచర్లను సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.మునెప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కార్వేటినగరం, జనవరి 3:వేణుగోపాలస్వామి ఆలయం వద్ద బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమంపై ఆసక్తి ఉన్న దాతలు ముందుగా తమ పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: టీడీపీ



నగరి, జనవరి 3: చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఒకటి, రెండో వార్డుల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ, మీ ఇంటికి మీ తెలుగుదేశం కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలోని ఏ వీధి చూసినా సమస్యల వలయంలో ఉన్నాయని వాపోయారు. రాజీవ్‌నగర్, నగరిపేట, కాకవేడులో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు. నాయకులు శ్రీనివాసన్, గుణశేఖర్, జ్యోతినాయుడు, అల్లిముత్తు, శ్రీధర్, చిట్టిబాబు, అశోక్, వెంకట్, నాగరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాగా..నగరి కేవీపీఆర్ పేటలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్ఎల్ మురుగన్ మృతి చెందడంతో ఆయన మృతదేహానికి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు.

వైసీపీ పాలనలో సర్కస్ ఫీట్లు తప్పవు: గాలి భానుప్రకాష్

వైసీపీ పాలనలో నగరిపేటలో వీధులన్నీ గుంతలమయమై సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని భానుప్రకాష్‌కు ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రోడ్డుపై నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వచ్చిందని వాపోయారు.

గత్రాళ్లమిట్టలో భవిష్యత్తుకు గ్యారెంటీ



గుడిపాల, జనవరి 3: భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం గత్రాళ్లమిట్టలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, టీడీపీ ఎస్సీ నాయకుడు ధనసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

తెల్లగుండ్లపల్లె గ్రామంలో..



వెదురుకుప్పం, జనవరి 3: చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వెదురుకుప్పం టీడీపీ మండలాధ్యక్షుడు కామసాని లోకనాథరెడ్డి అన్నారు. బుధవారం బొమ్మయ్యపల్లె పంచాయతీ తెల్లగుండ్లపల్లె గ్రామంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంచిపెట్టారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు రావిళ్ల వెంకటాద్రినాయుడు, బూత్ కన్వీనర్ గుణశేఖర్, డేటా అనలిస్ట్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్



పాలసముద్రం, జనవరి 3: టీడీపీ ప్రభుత్వంలోనే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని పార్టీ ప్రభావశీలుల గుర్తింపు కమిటీ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడు అన్నారు. బుధవారం పాలసముద్రంలో సింహరాజుపురం పంచాయతీకి చెందిన మునస్వామి, కుమరేశన్, ఎల్లప్పన్, చెంగల్రాయులు, పార్తీబన్, మునిక్రిష్ణ తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి థామస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు జె.విజయ్‌కుమార్, చిన్నదొరై, శబరివాసన్, ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి శూన్యం



చిత్తూరు సిటీ, జనవరి 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి శూన్యమని టీడీపీ నేతలు అన్నారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నేతలు మాట్లాడుతూ.. సీఎం జగన్ తన పాదయాత్రలో ముస్లిం మైనార్టీల ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. మరోవైపు టీడీపీ ప్రభుత్వంలోని అనేక సంక్షేమ పథకాలను రద్దుచేశారని వాపోయారు. పార్టీ ముస్లిం మైనార్టీ నేతలు నౌషాద్, మన్నా, జాఫర్, అక్తర్ బాషా, నవాజ్ బాషా, సయ్యద్ అన్వర్, గౌస్‌బాషా, జిలాని తదితరులు పాల్గొన్నారు.

దళితులు, బీసీలను బురిడీ కొట్టించిన జగన్



బంగారుపాళ్యం, జనవరి 3: ఎస్సీ, ఎస్టీ, బీసీలను సీఎం జగన్ బురిడీ కొట్టిస్తున్నారని పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. బుధవారం జయంతి, వినాయకపురం, మొగిలివారిపల్లి, బలిజపల్లి, పాలమాకులపల్లి గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జయంతిలో మీడియాతో మాట్లాడారు. జగన్ నవరత్నాలన్నీ బూటకమే అని దుయ్యబట్టారు. గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. జనార్దన్‌గౌడ్, హేమచంద్ర నాయుడు, వంశీ, సుదర్శన్ నాయుడు, శివ, రమేష్, గిరిబాబు, హరిప్రసాద్, రవి, దేవయాణి, మంజునాథ్, గ్రామస్తులు మునిరాజ, శివ, సిద్ధయ్య, జనార్దన్, కుమార్ పాల్గొన్నారు.

ఓట్లు వేయడానికే దళితులు కావాలా? డిప్యూటీ సీఎంపై టీడీపీ నేతల ధ్వజం

గంగాధరనెల్లూరు, జనవరి 3: 'ఎన్నికల్లో ఓట్లు వేయడానికి మాత్రమే దళితులు కావాలి. అదే దళిత కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే వారికి కనీసం రూ.వెయ్యి అయినా ఆర్థిక సాయం చేశావా?' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుండయ్య, మండలాధ్యక్షుడు స్వామిదాస్, మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. టీడీపీ ఇన్‌చార్జి థామస్ మాత్రం తన పరిధిలోని దళిత కుటుంబాల్లో ఎవరైనా దురదృష్టవశాత్తూ మృతి చెందితే వారిని పరామర్శిస్తారన్నారు. ఆ కుటుంబాలకు తన వంతు ఆర్థిక సాయం చేయడంలో తప్పేంటని ప్రశ్నించారు. దీన్ని తప్పుగా చూపడం నారాయణస్వామికే చెల్లిందన్నారు. నాయకులు కామసాని కోదండరెడ్డి, సుబ్రహ్మణ్యం, అరుల్ నాథన్, వెంకటేష్, జేవీ శివప్రసాద్, రాజేంద్రన్, జాన్, మునస్వామి, ప్రకాష్, బుజ్జి, శంకర్, ఆనంద్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు



శ్రీరంగరాజపురం, జనవరి 3: కలెక్టరేట్ ముట్టడికి వివిధ మండలాల నుంచి వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిమిట్ట వద్ద కూడా వీరిని పోలీసులు అడ్డుకున్నారు. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై నిరసన చేస్తున్న వారిని ఎస్‌ఆర్‌పురం పోలీసు స్టేషన్‌కి తరలించారు.

కార్వేటినగరంలో..



కార్వేటినగరం, జనవరి 3: కలెక్టరేట్ ముట్టడికి వెళ్లనీయకుండా తమను స్థానిక పోలీసులు అడ్డుకున్నారని అంగన్వాడీలు తెలిపారు. కార్యక్రమం జయప్రదం కాకూడదన్న ఉద్దేశంతోనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారని వాపోయారు.

అక్రమ అరెస్టులా? : ఏఐటీయూసీ



నగరి, జనవరి 3: అక్రమ అరెస్టులు చేయడం సరికాదంటూ నగరి నియోజకవర్గ ఏఐటీయూసీ నాయకులు అన్నారు. కలెక్టరేట్ ముట్టడికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడంతో వీరికి ఆటో, మున్సిపల్ కార్మికులు రోడ్డుపై సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ కార్యదర్శి కోదండయ్య, పట్టణ నాయకులు వేలన్ బాషా, మురళి, రూప్‌కుమార్, శేఖర్ పార్వతి, కాంచన, మోహన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పోలీసులే చుక్కలు చూపిస్తారు: సీపీఐ



చిత్తూరు రూరల్, జనవరి 3: 'పోలీసులతో కార్మికుల ఉద్యమాన్ని అణిచివేస్తున్నారు. జగన్ ప్రభుత్వానికి పోలీసులు చుక్కలు చూపించే సమయం ఆసన్నమైంది'అని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. బుధవారం అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడికి వెళ్లనీయకుండా ఆయనతోపాటు పలువురునాయకులను హౌస్ అరెస్టు చేశారు. రానున్న రోజుల్లో ప్రజలూ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

జిమ్ భవన నిర్మాణానికి భూమి పూజ



కొప్పేడులో భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

నిండ్ర, జనవరి 3: కొప్పేడులో జిమ్ నూతన భవన నిర్మాణానికి మంత్రి రోజా బుధవారం భూమిపూజ చేశారు. రూ.33.8లక్షలతో భవనం నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, ఎంపీడీవో అరుణ, కో-ఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ చెంచమ్మ, మాజీ సర్పంచ్‌లు రామచంద్రయ్య, సత్యరాజ్, రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, క్రీడా భవన నిర్మాణ ఈఈ సిద్దయ్య, డీఈ ఖలీల్, ఏఈ ప్రసాద్, స్థానిక నాయకులు సునీల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపునిస్తే ప్రపంచాన్ని ఇచ్చినట్లే

నగరి: కంటి చూపునిస్తే ప్రపంచాన్ని అందినట్లవుతుందని మంత్రి రోజా అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో రోజా చారిటబుల్ ట్రస్ట్ ఉచిత కంటి వైద్యశిబిరాన్ని, మొబైల్ కంటి ఆపరేషన్ యూనిట్‌ను ప్రారంభించారు. రోజూ రోజు 300 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుందన్నారు. శంకర్ నేత్రాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సూర్యోదయం కన్నా ముందే పింఛను

సూర్యోదయానికంటే ముందే లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందించడం సీఎంకే సాధ్యమని మంత్రి అన్నారు. నగరి పట్టణ పరిధిలో బుధవారం పెంచిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్లు దయానిధి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలో కొత్తగా 265మందికి పింఛన్లు మంజూరు అయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ బుధవారం తెలిపారు. దీంతో మొత్తం 11,291మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు.

పూతలపట్టు: ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ కుమారి, ఎంపీడీవో గౌరి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, పోలవరం సుధాకర్ రెడ్డి, దొరస్వామి రెడ్డి, నిరంజన్ రెడ్డి, జయచంద్రారెడ్డి, రాజరత్నం రెడ్డి, ప్రవీణ్, ఎం.ఎస్.మణి, మాసలామణి పాల్గొన్నారు.

'పంచాయతీలను నిర్వీర్యం చేసిన వైసీపీ'

నగరి, జనవరి 3: వైసీపీ అధికారంలోకి వచ్చాక పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని టీడీపీ నాయకులు ఆరోపించారు. విజయవాడలో బుధవారం నుంచి జరుగుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచిలు, ఎంపీటీసీల సమావేశానికి నగరి నియోజకవర్గం నుంచి తరలి వెళ్లారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికారప్రతినిధి ధనంజయలునాయుడు, నాయకులు సురేష్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, గాలి రమేష్ పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలానికి చెందిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు మోహన్‌రాజ్, నీలకంఠంనాయుడు, దేవరాజులు నాయుడు, శశికర్‌బాబు, కంద కూడా విజయవాడకు తరలివెళ్లారు.

పెనుమూరు: జీడీ నెల్లూరు నియోజకవర్గం నుంచి సర్పంచుల సంఘం అధ్యక్షుడు కృష్ణమనాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యదర్శి తలారి రెడ్డెప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు రవియాదవ్, కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, వెంకటేశ్‌యాదవ్ తదితరులు కూడా విజయవాడకు వెళ్లారు.

సురక్ష శిబిరంలో తనిఖీలు

చిత్తూరు రూరల్, జనవరి 3: నగరంలోని టెలిఫోన్ కాలనీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు: 11, 31 వార్డు సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. అంతకుముందు కమిషనర్ అరుణ శిబిరాన్ని పర్యవేక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ప్రభావతి, సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, స్థానికకార్పొరేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, జనవరి3: పుంగనూరు- మదనపల్లె మార్గంలోని కొత్తయిండ్లులో రోడ్డుపై నడిచివెళుతున్న మహిళను ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొనడం తో ఆమె తీవ్రంగా గాయపడింది. కొత్తయిండ్లుకు చెందిన బాలాజీ భార్య రాధమ్మ బుధవారం ఉదయం కూలీ పనుల నిమిత్తం నడిచి వెళుతుంటే వెనుకవైపు నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో కాలుకు దెబ్బ తగిలింది. తీవ్రంగా గాయపడిన రాధమ్మకు రోడ్డుపైనే 108 సిబ్బంది కట్టుకట్టి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచనల మేరకు కుటుంబ సభ్యులు ఆమెను తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెటిల్మెంట్‌గా 2003 ముందిచ్చిన డీకేటీ భూముల మార్పు: తహసీల్దార్



సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

విజయపురం, జనవరి 3: ప్రభుత్వం 2003వ సంవత్సరానికి ముందు ఇచ్చిన డీకేటీ భూములను సెటిల్మెంట్‌గా మార్చాలని ఉత్తర్వులు అందాయని తహసీల్దార్ వెంకట్రాయలు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాయలంలో ఎంపీపీ జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సామిరెడ్డి కండ్రిగ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో గుంతలకు మరమ్మతులు చేయాలని సర్పంచ్ సుబ్రహ్మణ్యం కోరారు. విజయపురం అమ్మగుంట ఎస్టీ కాలనీలో అంగన్వాడీ పిల్లలకు సెంటరు వద్దనే అన్నం పెట్టాలని సర్పంచ్ జపమేరీప్రసన్నకుమార్ కోరారు. పన్నూరు పాఠశాల ఆవరణంలో యువతకు ఉపయుక్తంగా జిమ్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ గోవిందమ్మ సూచించారు. నాడు - నేడు కింద 34 పాఠశాలలను ఆధునికీకరించినట్లు ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. తుఫానులో వరి 15 ఎకరాలు, వేరుశనగ 102 ఎకరాలు, ఉద్దులు, పెసలు పంటల్లో నష్టం వాటిల్లిందని ఏవో రజనీకుమారి తెలిపారు. ఎంపీడీవో చంద్రమౌళి, వైస్‌ఎంపీపీ మంజుబాలాజి, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, ఏఈఈలు వీరభద్రం, ప్రశాంత్, చంద్రబాబు, ఈవోపీఆర్డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణిఅమ్మకు పుష్పాభిషేకం



చిత్తూరు కల్చరల్, జనవరి 3: తమిళనాడు వేలూరు బంగారు గుడి వ్యవస్థాపకుడు నారాయణి అమ్మ జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం స్వామికి మంత్రి పెద్దిరెడ్డి దంపతులు పుష్పాభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు, పీఆర్వో కళ్యాణ చక్రవర్తి, భక్తులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కార్వేటినగరం, జనవరి 3: కేపీ అగ్రహారం, కృష్ణాపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. యువమోర్చా మార్కెటింగ్ కమిటీ కోకన్వీనర్ నడింపల్లి యువరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు రాజశేఖర్, చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీని పరిశీలించిన డీఎఫ్‌వో



పెనుమూరు, జనవరి 3: లక్కలపూరివాండ్లవూరు ఎస్టీ కాలనీలో బుధవారం జిల్లా ఫారెస్టు ఆఫీసర్ (డీఎఫ్‌వో) చైతన్యకుమార్ పరిశీలించారు. కాలనీలో 10 కుటుంబాల ఎస్సీలు, 8 కుటుంబాల ఎస్టీలు నివాసముంటున్నాయి. వీరుంటున్న స్థలం రిజర్వు ఫారెస్టులో ఉండటంతో ఇక్కడ రోడ్లు వేయాలన్నా వీలు కావడంలేదు. దాంతో గడపగడపలో స్థానిక ఎమ్మెల్యేకి తెలియజేయడంతో ఆయన ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. సర్వే చేసి, వివరాలను పైఅధికారులకు పంపి పట్టాలు ఇచ్చేందుకు సహకరిస్తామని డీఎఫ్‌వో తెలిపారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ థామస్ సుకుమార్, బీట్ ఆఫీసర్ గౌస్ బాషా, ఎంపీటీసీ యశోదారెడ్డి, ఎస్సీ నాయకులు దాము పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



బంగారుపాళ్యం, జనవరి 3: బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో 25వ రోజు అన్నదానానికి నలగాంపల్లెకు చెందిన దినకర్ శెట్టి, విశ్వనాథ నాయుడు భోజనం వితరణ చేశారు. జనార్దన్ గౌడ్, గిరిబాబు, రమేష్, మోహన్ నాయుడు, శ్రీనివాసులు, చిరంజీవి పాల్గొన్నారు.

7న శ్రీకృష్ణ దేవరాయల విగ్రహావిష్కరణ



బంగారుపాళ్యం, జనవరి 3: పుంగనూరు - మదనపల్లె బైపాస్‌రోడ్డులో ఈనెల 7వ తేదీన శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణకు తరలిరావాలని కాపు సంఘ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కుమార్‌రాజా ఫాంహౌస్‌లో కాపులు సమావేశమై వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. నాగభూషణం, గజేంద్ర, విద్యాసాగర్, గోవిందస్వామి, పరదేశి, తోట శ్రీహరి, దొరస్వామి పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ



చిత్తూరు రూరల్, జనవరి 3: బీఎన్‌ఆర్ పేటలో బుధవారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలు గ్రామస్తులకు పంపిణీ చేశారు. కేశవులు శెట్టి, అనీల్‌శర్మ, బాబు, మోహన్‌నాయుడు, గురు గణేష్, దేవరాజన్, మధు, శివకుమార్, లోకనాథం, బాబు, పుష్పాద్రి తదితరులు పాల్గొన్నారు.

మేల్‌మరువత్తూర్‌కు ఉచిత బస్సులు

చిత్తూరు సిటీ, జనవరి 3: ఓంశక్తి భక్తులు మేల్‌మరువత్తూర్‌కు వెళ్లి రావడానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటుచేశారు. బుధవారం రాత్రి నగరంలోని 14వ డివిజన్ తిమ్మసానిపల్లె, గుడిపాల మండలం వెప్పాలమానుచేను గ్రామంలో నిర్వహించిన పూజల్లో ఫౌండేషన్ నిర్వాహకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం, చీరలు వితరణ చేశారు. రెండు బస్సులను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు సహకరించండి: కమిషనర్

నగరి, జనవరి 3: మున్సిపల్ పరిధిలో కార్మికులు సమ్మెలో ఉండటంతో స్థానికులు, వ్యాపార సంస్థలు చెత్తసేకరణలో సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద పోగయ్యే చెత్తను డస్ట్ బిన్లలో ఉంచాలన్నారు. కాలువలు, బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై చెత్త వేయొద్దన్నారు. సమ్మె ముగియగానే చెత్తను పారిశుధ్య సిబ్బంది సేకరిస్తారని చెప్పారు.